క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో జియారత్



కాకరవాడలో మౌలాలిస్వామి పీరుకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని కాకరవాడ గ్రామంలో మౌలాలి స్వామి జియారత్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసిన 9వ రోజు గ్రామంలో జార్తలు నిర్వహించడం ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తోంది. గురువారం అర్ధరాత్రి అనంతరం మౌలాలి స్వామి పీర్‌కు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాల్య వివాహాలు అరికట్టండి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో అన్ని సంక్షేమ హాస్టళ్ల అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. తర్వాత పిల్లల రక్షణ, బాల్య వివాహాల కట్టడి చర్యలపై రాజేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీడీఓ లీలావతి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి చింతామణి, విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ఉయ్యాలవాడ : పొదుపులక్ష్మి గ్రూపు సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని అల్లూరు స్టేట్ బ్యాంకు మేనేజర్ నరసింహుడు మహిళలకు సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు గ్రూపు సభ్యులు, వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలి

గోస్పాడు: అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని పీఆర్‌టీయూ మండల నాయకుడు సుబ్బరాయుడు నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

శిరివెళ్ల: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరం విజయవంతమయింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరాం వైద్య శాల డాక్టర్ల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ మంజునా షావలి 140 మందిని పరీక్షించి 30 మందికి గుండె సంబంధ సమస్యలను గుర్తించారు. ఉన్నత చికిత్స చేయించుకోవాలని సూచించారు. విద్యార్థి సంఘం నాయకులు, కండె ఆనంద్, శ్యాం సుందర్‌లాల్ గుప్త పాల్గొన్నారు.

ప్రహరీ క్లబ్‌లు, చిల్డ్రన్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో ప్రత్యేక ప్రహరీ క్లబ్‌లు, చిల్డ్రన్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల అమ్మకాలు నిషేధించడం, వాటి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులను చైతన్య పరచడం చేయాలన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు వెంటనే ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటి వివరాలను తనకు పంపాలన్నారు.

వైద్యుల పనితీరుపై విచారణ

చాగలమర్రి: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు షేక్.ఇమ్రాన్, అంజలీలు విధుల నిర్వహణపై ఆరోపణలు వెలువెత్తడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం అదనపు డీఎంహెచ్‌ఓ శారదాబాయి విచారణ చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీలో 13 సచివాలయాల వైద్య ఆరోగ్య సిబ్బందితో ఆమె విడివిడిగా సమావేశమై విచారించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె విలేకరులకు తెలిపారు. వైద్యులు షేక్.ఇమ్రాన్, అంజలీల మధ్య డీడీఓ పోస్టు విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. ఈ కారణంతో ఇరువురు ఆసుపత్రికి వచ్చిన రోగులను సరిగ్గా పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

మాయమాటలను నమ్మొద్దు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

రుద్రవరం: ఎవరైనా మాయమాటలు చెబితే నమ్మి మోసపోవద్దని శిరివెళ్ల సీఐ చంద్రబాబు బాలకలకు సూచించారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం ఆయన బాలికల రక్షణ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయునులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవీ..దీవించు



కాళికాంబకు హారతి ఇస్తున్న దృశ్యం



జగజ్జననీ మాతకు సమర్పించేందుకు ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జనని, శ్రీకాళికాంబ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆయా ఆలయాలకు తరలివచ్చారు. పలువురు అమ్మవారికి పుట్టింటి పట్టు చీర, సారె సమర్పించారు. జగజ్జనని ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే అర్చకులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకిరింప చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, రాహు కాల పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చీర, సారెను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శాకాంబరిగా కాళికాంబదేవి

లోక కల్యాణం కోసం శుక్రవారం పట్టణంలోని కాళికాంబదేవిని శాకాంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామునే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం దేవాలయ ఆవరణంలో పల్లకోత్సవాన్ని నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళిమాత సేవా సమితి ఆధ్వర్యంలో మాడుగుల నాగఫణి శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు సుబ్రమణ్యశాస్త్రి,రాఘవేంద్రచారి,సుబ్బాచారి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



గోవిందపల్లెలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ఉయ్యాలవాడ: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నంద్యాల డీఎల్‌డీఓ రాంబాబు ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామమైన గోవిందపల్లె గ్రామాన్ని డీఎల్‌పీఓ తన బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పరిసరాలను, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పరిశుభ్రతలో గోవిందపల్లె గ్రామాన్ని మండలంలోని మిగతా గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఎంపీడీఓ రఘురాం, ఈఓపీఆర్‌డీ మహిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు వేస్ట్ ఆయిల్,, మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయించాలన్నారు. పారిశుధ్య లోపంపై ప్రజల నుంచి ఫిర్యాదులందితే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, ఏఈ మురళీ నాయక్, ఈఓఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఉయ్యాలవాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌క్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, మండల ఎంఈఓ రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: వ్యాధి నిరోధక టీకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్ అన్నారు. మండల కేంద్రం గోస్పాడు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాక్సినేషన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటలాడే సమయంలో ప్రమాదశాత్తు కిందపడి రక్త గాయాలు జరిగినప్పుడు, ఏదైనా తుప్పు పట్టిన ఇనుప వస్తువుల ద్వారా గాయాలు అయినప్పుడు మట్టిలో తుప్పులో నిక్షిప్తమై ఉండే బ్యాక్టీరియా, శరీరంలోకి చేరడం వల్ల ధనుర్వాతం సోకే అవకాశం ఉందని, ఇందు కోసం ముందుగా టీటీ వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. అలాగే గొంతుకు సంబంధించిన డిఫ్తీరియా అనే వ్యాధి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు వస్తుందన్నారు. ఇందు కోసం డీపీటీ వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. పది సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ టీడీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. వర్షా కాలంలో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో పొలం బడి

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురంలో మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ శుక్రవారం రైతులతో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది పొలం బడి కింద శ్రీరంగాపురాన్ని ఎంపిక చేశామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విత్తనం మొదలు పంట కోత వరకు ప్రతి రైతు శాస్త్రవేత్తగా మారాలన్నారు. ప్రధానంగా వరి సాగుకు సంబంధించి నారుమడిలో యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పండించిన ఉత్పత్తులను రైతు సంఘంతో కలిసి ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేయించి అధిక ఆదాయం వచ్చేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, వీఏఏ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

చదువుపై విద్యార్థులకు ఆసక్తి కల్పించాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ:చదువు పట్ల ప్రతి విద్యార్థిలో ఆసక్తి కల్గించినప్పుడే మంచి ఫలితాలు రాబట్టవచ్చని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైపీపీఎం జూనియర్ కళాశాలలో జరుగుతున్న తొమ్మిదిరోజుల తరగతి పరిశీలన శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ శిక్షణ తరగతుల వల్ల అకడమిక్ ప్రమాణాలు పెరుగుతాయన్నారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు మంచిగా విద్యాబోధన చేసేందుకు ఉపయోగ పడతాయన్నారు. రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచేలా బోధన సాగాలన్నారు. రాష్ట్ర పరిశీలకుడు సోమశేఖరశర్మ, కోర్స్ డైరెక్టర్ రఘురామిరెడ్డి, ఎంఈఓలు శోభావివేకవతి, గంగాధర్, శిక్షణా కో- ఆర్డినేటర్లు మహబూబ్‌బాషా, గయిబువలి, గుర్రప్ప, తిమ్మయ్య పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

చాగలమర్రి: విద్యార్థులు చదువుతో పాటు వివిధ అంశాల్లో నైపుణ్యాలు పెంచుకోవాలని చాగలమర్రి జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటయ్య అన్నారు.మండల కేంద్రంలోని ఆ పాఠశాలలో శుక్రవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ వస్తువుల తయారీకి సంబంధించి నైపుణ్యాల పెంపుపై అవగాహన కల్పించారు. తర్వాత విద్యార్థులు తయారు చేసిన వివిధ చార్ట్‌ను ప్రదర్శించారు. ఐటీ ఉపాధ్యాయుడు బాలయ్య, ఉపాధ్యాయులు పీడీ దాదాపీర్, శాస్త్రి, మహబుబ్‌బాషా, రవీంద్రారెడ్డి, సుబ్రమణ్యం, సురేషప్పా పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి సాంకేతిక విద్య

దొర్నిపాడు:ప్రతి విద్యార్థికి సాంకేతిక విద్య అవసరం అని హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. శిక్ష సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంకేతిక నైపుణ్యాల గురించి వివరించారు. విద్యార్థులకు ట్యాబ్‌లతో సాంకేతిక విద్యను ఎలా నేర్చుకోవాలో వివరించారు.

క్రైమ్ కార్నర్

30 లీటర్ల నాటుసారా స్వాధీనం

బొమ్మలసత్రం: గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి ఆమె నుంచి 30 లీటర్ల నాటుసారాను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపాడు గ్రామానికి చెందిన కృష్ణవేణి నాటుసారాను అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో వారు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని కృష్ణవేణిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సెబ్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరుకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదైంది. ఈయన పొలం వద్ద పైన గ్రామానికి చెందిన రైతు లక్ష్మీరెడ్డి భూమి ఉంది. దిగువనున్న తన పొలానికి దారి ఇవ్వడాన్ని లక్ష్మీరెడ్డి నిరాకరించడంతో ఆయనకు సంబంధించిన మిర్చిపంటను రమణారెడ్డి ధ్వంసం చేశాడు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

దారి దోపిడీ దొంగలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): ప్రజలను భయపెట్టి దారి దోపిడీకి పాల్పడే దొంగలకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి శుక్రవారం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కోర్టు అధికారులు తెలిపిన వివరాల మేరకు.. 2021లో తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్‌కు వెళ్లే రహదారిలో గొటిక మాను బీడు వద్ద కొందరు వ్యక్తులు గుంపులుగా కూడి దారి దోపిడీ చేస్తున్నారనే సమాచారం పాణ్యం పోలీసులకు తెలిసింది. వెంటనే వారు అక్కడికి చేరుకుని ఆ దొంగలను పట్టుకుని, వారి వద్ద ఉన్న మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితులైన దాసరి వీరయ్య, మంతిగాడు, గొలుసన్న, నాగన్న, తోట చిన్న వీరన్నలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై ఐదుగురికి రెండేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.7వేలు జరిమానా విధించారు.

భర్తే కడతేర్చాడు

దొర్నిపాడు: రామచంద్రాపురంలో ఈనెల 17న సుమలత(26) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. పోస్టుమార్టం నివేదికలో ఆమెను గొంతునులిమి భర్త జోసఫ్ చంపినట్లు తేలింది. దీంతో ఆతడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఈ రోజు

ఉద్యోగ మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ విద్యా సంస్థ అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే ఈమేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీకాం, బీటెక్ విద్యార్హత కలిగి ఉండాలని శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు.

రాష్ట్రస్థాయి వైద్య విజ్ఞాన సదస్సు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో ఈఎన్‌టీపై నేటి నుంచి రెండురోజుల పాటు రాష్ట్రస్థాయి వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం డాక్టర్ మధుసూదనరావు, నాగమణి, మణిదీప్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది యువ ఈఎన్‌టీ వైద్యులు ఈ సదస్సుకు హాజరై చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల్లో మెళకువలపై శిక్షణ తీసుకుంటారన్నారు. అనంతరం వారు సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆసుపత్రి కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యులు రవికృష్ణ, అప్పారావు, విద్యాసాగర్, మాధవి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



నేలంపాడులో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ

చాగలమర్రి: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు ఏపీఓ నిర్మలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నేలంపాడు గ్రామంలో ఆమె రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామి పథకం ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసేందుకు ఇప్పటి వరకు 149 ఎకరాల విస్తీర్ణంలో రైతులను గుర్తించామని తెలిపారు. ఈ ఏడాది మండలంలో 350 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా 5 ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులను గుర్తిస్తున్నట్లు చెప్పారు. వందశాతం సబ్సిడీతో 16 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చన్నారు. మండలంలో ఆసక్తి గల రైతులు తమ పొలానికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, టీఏ మద్దిలేటి, ఎఫ్ఏ వెంకటేశ్వరరెడ్డి ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

- ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చాగలమర్రి: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ తాహీర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రం చాగలమర్రిలోని 3వ సచివాలయం ఆవరణలో సర్పంచ్ తోలసమ్మ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్య ఉందన్నారు. వీటి పరిష్కారానికి సచివాలయ, పంచాయతీ సిబ్బంది కృషి చేయాలన్నారు. సమస్యలు లేకుండా గ్రామాన్ని తీర్చిదిద్దితే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరవుతాయన్నారు. గ్రామ సభలో పంచాయతీ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సభ ప్రజా సమస్యలను గుర్తించటానికి నిర్వహిస్తే గ్రామం నుంచి ఒక్కరు కూడా హాజరు కాకపోవడం విశేషం.

1 నుంచి కళారాధన సాంస్కృతిక పోటీలు

నంద్యాల(వ్యవసాయం): మాతృభూమికి కళార్చన పేరుతో ఆగస్టు 1వ తేదీ నుంచి పాఠశాల విద్యార్థులకు కళారాధన సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాతూ గత 23 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 75 అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో చిత్రపట విశ్లేషణ, లఘు చలన చిత్ర విశ్లేషణ, కవితా రచన, లేఖ రచన, కవితాగానం, సంస్కృత శ్లోకాల పఠనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, జానపద, శాస్త్రీయ, ఆధునిక నృత్య, పాటల పోటీలు, దేశ భక్తి బృంద నృత్యాలు, ఏకపాత్రాభినయం, లఘునాటికలు తదితరవి నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఆగస్టు 15వ తేది సాయంత్రం జరిగే వేడుకల్లో బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. దేశ భక్తి భావాలను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను బాలాజీ కాంప్లెక్స్‌లోని కళారాధన కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు సెల్ : 9959307424కు సంప్రదించాలన్నారు.

కాల్వలకు నీరు వదలాలి

నంద్యాల(అర్బన్): సుంకేసుల ద్వారా కేసీ కెనాల్‌కు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా కాల్వలకు వెంటనే నీళ్లు వదలాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం తెలుగుగంగ ఈఈ పార్థసారథికి వారు వినతి పత్రం అందజేశారు.

జేసీని కలిసిన వాహన డ్రైవర్లు

నంద్యాల(అర్బన్): జేసీగా బాధ్యతలు చేపట్టిన విష్ణు చరణ్‌ను శుక్రవారం జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల అసోసియేషన్ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, ఉపాధ్యక్షుడు శీను ఆధ్వర్యంలో సభ్యులు జేసీకి పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పోల్‌రెడ్డి, రామనాయుడు, రాజారావు, కృపాకర్, మోహన్, త్రినాథ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ శిక్షణ తరగతులను జయంప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): నేటి నుంచి ఈనెల 30 వరకు నేషనల్ పీజీ కళాశాలలో డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామన్న తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు.

పట్టుబడిన రేషన్ తరలింపు

శిరివెళ్ల: మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం పట్టుబడిన 53.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యర్రగుంట్ల సివిల్ సప్లయిస్ గోడౌన్‌కు తరలించినట్లు తహసీల్దార్ నర్సిరెడ్డి తెలిపారు. రేషన్ అక్రమ నిల్వలపై నంద్యాల ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పోలీసులు వెంకటాపురం గ్రామంలో దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

దేశ సేవకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి



ఆళ్లగడ్డ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): దేశానికి సేవ చేసేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో మనదేశం పోరాడి గెలిచిందన్నారు. ప్రతి ఒక్కరు మాతృదేశంపై భక్తిభావం కలిగి ఉండాలన్నారు. సైన్యంలో చేరి సమాజ హిత పనులు చేయాలన్నారు. అనంతరం డీఎస్పీని సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, ఎస్పీవైరెడ్డి, రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నయనాంధ్ర బెటాలియన్స్ స్టాఫ్‌వల్దర్ మహమ్మద్ షరీఫ్, నాయక్ సువేదర్, సరోజ్‌కుమార్, సుమంత్, డాక్టర్ లలితా సరస్వతి, కమాల్‌ఖాన్, శివన్న, లక్ష్మీదుర్గా, రమణమ్మ, రూట్‌మేరి పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ వీరులకు సత్కారం

నంద్యాల(వ్యవసాయం): కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్గిల్ యుద్ధ వీరులను సత్కరించి అమరులైన వీరసైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ సైనికుల సేవలను కొనియాడారు. కార్గిల్ యుద్ధ వీరులు నియాజీ, లక్ష్మయ్య మాట్లాడుతూ తాము ఎందరో వీరుల ప్రాణత్యాగ ఫలితమే కార్గిల్ విజయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, కార్యదర్శి రమేష్, రవిప్రకాష్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేం

ఆళ్లగడ్డ: దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్‌కే పాఠశాల ఆవరణ నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు జై జవాన్.. జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి వీర సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైనికులు దేశ రక్షణకు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. కార్గిల్ యుద్ధంలో సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడి దేశాన్ని గెలిపించారని కొనియాడారు.

సర్కారు వారి పాటకు తూట్లు

- మునిసిపల్ దుకాణాల వేలాల్లో వ్యాపారులు సిండికేట్
- చోద్యం చూసిన అధికారులు



వేలం జరుగుతుండగా సిండికేట్ అవుతున్న వ్యాపారస్తులు

నంద్యాల(సిటీ): పట్టణంలో మునిసిపల్ దుకాణాల వేలంలో నిబంధనలకు తూట్లు పొడిచారు. తక్కువ ధరకు పాడేందుకు వ్యాపారులు సిండికేట్ అయ్యారు. పట్టించుకోవాల్సిన మునిసిపల్ అధికారులు చోద్యం చూడటం గమనార్హం. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. మొత్తం 31 దుకాణాలకు వేలం నిర్వహించగా అందులో 19 దుకాణాలకు ఎవరూ ముందుకు రాలేదు. సరైన ప్రచారం చేయకపోవడంతోనే ఇలా జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరు ఒకరిది..వేలం మరొకరిది

సాల్వెన్సీ, గుడ్‌విల్ లేక పోయినా ఇతరుల ఆధారాలపై కొందరు వేలంలో పాల్గొని దుకాణాన్ని దక్కించుకున్నారు. పట్టణంలోని డైలీ వెజిటబుల్ మార్కెట్‌లోని 13వ దుకాణాన్ని ఇటీవల అధికారులు రూ.8 వేల ధరతో సర్కారు వారి పాటగా నిర్ణయించారు. అయితే ఈ దుకాణానికి సంబంధించి షేక్షా వలి, ఇమ్రాన్, అన్వర్‌లు తమ సాల్వెన్సీ, గుడ్‌విల్‌తో వేలానికి వచ్చినట్లు అధికారుల రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. కానీ వేలంలో మాత్రం ఇమ్రాన్‌కు బదులుగా కేవీ బాబు బహిరంగ వేలంలో పాల్గొని దుకాణాన్ని దక్కించుకున్నారు. అంతే కాకుండా కేవీ బాబు అని మున్సిపల్ రికార్డుల్లో సంతకం చేసినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. కాగా వేలాల నిర్వహణలో ఆర్ఐ గులాం హుస్సేన్ సమయపాలన పాటించకపోవడంతో పలువురు వ్యాపారులు తీవ్ర నిరసన తెలిపారు.

నేడు కూరగాయల మార్కెట్, సైకిల్ స్టాండ్‌లకు వేలం

నంద్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 11 దుకాణాలకు శుక్రవారం వేలం జరిగిందని ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. సైకిల్ స్టాండ్, మార్కెట్ గేట్లకు నేడు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు.